క్లుప్తంగా

వాహనాల వేలం

ములకలచెరువు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కేశప్ప, సీఐ షాదీక్ అలీ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం నిర్వహించారు. నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించగా రూ.28,500 వేలు ఆదాయం వచ్చినట్లు ఎస్‌ఐ గాయత్రి తెలిపారు.

జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం: జూదం ఆడుతున్న నలుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎన్‌వో పల్లె పంచాయతీ మిట్టావాండ్లపల్లె వద్ద జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో నలుగురు పట్టుబడగా, వీరి నుండి రూ.3200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సారా విక్రేతల అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని నక్కలదిన్నె, బసినికొండ ప్రాంతాల్లో నాటుసారా అమ్మకాలు సాగిస్తున్న ముగ్గురిని అరెస్ట్‌చేసి 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ శ్రీహరి రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..నక్కలదిన్నెలో నాటుసారా అమ్మకాలు సాగిస్తున్న బాణావత్ శ్రీరాములునాయక్(49), బుక్యాలలిత(30)లను అరెస్ట్ చేసి వారి నుంచి 4 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బసినికొండలో బాణావత్‌గోపాల్‌నాయక్(40)ను అరెస్ట్‌చేసి 4 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండు కేసుల్లోని ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరిస్తే మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. ఎస్‌ఐ అంజాద్‌బాషా, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టండి

ములకలచెరువు: దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు తగిన చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా పెద్దపాళ్యంలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. నీటు సంపులు, మురుకినీటి కాలువల్లో అబెట్ పిచకారి చేయించారు. అనంతరం దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

రైతు బజారు ఏర్పాటు చేయాలని వినతి

పీలేరు : పీలేరులో రైతు బజారు ఏర్పాటుకు చొరవ చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌కు జిల్లా రైతు సలహామండలి సభ్యుడు బోడేషావలి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం రాయచోటిలో జరిగిన జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశంలో వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఉత్సవ్ 2కే23

పీలేరు : స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉత్సవ్ 2కే23 ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంపొందించడానికి ఉత్సవ్ 2కే23 నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటీ అక్యాఖాన్ నృత్య ప్రదర్శన, కేరళ వాయిద్య బృందాల కళాప్రదర్శన ఆకట్టుకున్నాయి. అలాగే పలువురు విద్యార్థులు నృత్య ప్రదర్శన పోటీలో పాల్గొన్నారు. నృత్యంలో, డిప్లొమా, ఇంజినీరింగ్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అవినాష్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల నిరసన

ములకలచెరువు: స్థానిక పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఐ నాయకులు ఆనంద్, అంజనప్ప కోరారు. శుక్రవారం పీహెచ్‌సీ ఎదుట వారు వైద్య సిబ్బందికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీకి తాగునీటి బోరు లేదని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసులు ఫిట్‌నెస్ కలిగి ఉండాలి

మదనపల్లె : పోలీసులు శారీరకంగా మంచి ఫిట్‌నెస్ కలిగి ఉండాలని డీఎస్పీ కేశప్ప అన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు మదనపల్లె సబ్‌డివిజన్ పోలీస్ కార్యాలయ ఆవరణలో వీక్లీ పెరేడ్ సందర్భంగా ఫిజికల్ ఫిట్‌నెస్, ఆత్మరక్షణ, విధి నిర్వహణలో అప్రమత్తతకు సంబంధించి శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మదనపల్లె యూత్ కరాటే క్లబ్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఏ.ఆర్.సురేష్ ఆధ్వర్యంలో కరాటే, ఫిజికల్ ఫిట్‌నెస్‌కు సంబంధించి మెలకువలు తెలిపారు. సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ, శివాంజనేయులు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ కృష్ణయ్య, ఎస్‌ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గుర్రంకొండ: పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని కలకడ సీఐ నాగేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు తమ విధులతో పాటు ఆరోగ్యం పై కూడా తగినంత శ్రద్ధ తీసుకోవాలన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక

మదనపల్లె : శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం బెంగళూరుకు చెందిన 24/7 సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఏడుమంది అడ్వైసర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండగురుప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అడ్వైసర్ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.2.7 లక్షల వేతనం అందుతుందన్నారు. ఎపికైన వారిని ప్రిన్సిపాల్ సురభిరమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్రకుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్‌బాబు అభినందించారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: రాష్ట్రంలో పేదల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో తంబళ్లపల్లె, పరషతోపు పంచాయతీలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నాయకులు, ఎస్‌ఎల్‌వి నాట్యకళామండలి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు తనను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించారని, ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. ఆ గుర్తింపుతోనే తంబళ్లపల్లె నియోజకవర్గంలో సుమారు రూ.10వేల కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజలు గత ప్రభుత్వ పాలనకు, ఇప్పటి ప్రభుత్వ పాలనకు బేరీజు వేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రానికే ఆదర్శంగా నెంబర్‌వన్ స్థానంలో నిలుపుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ గ్రామ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు ఇరగం సుబ్బారెడ్డి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, సర్పంచులు నీలూఫర్, పార్వతమ్మ, ఎంపీపీ అనసూయమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్నరెడ్డి, కోప్షన్ సభ్యులు జమాల్‌బాషా, డీఎల్‌డీవో లక్ష్మీపతి, తహసీల్దార్, శ్రీనివాసులు, ఎంపీడీవో సురేంద్రనాథ్, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

బి.కొత్తకోట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం తొలి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక బీరంగిరోడ్డు, ఖాజాఖాన్‌వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారం కోసం తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యలను తీర్చడంలో జాప్యం చేయవద్దని అధికారులను సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతిఫిర్యాదును పరిష్కరించామన్నారు. అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 2021 ఏడాదిలో 963 మందికి రూ.2.31 కోట్లు, 2022లో 1,192 మందికి రూ.2.86 కోట్లు అందించగా ఈ ఏడాది 1,295 మందికి రూ.3.10 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్, నగరపంచాయతీ మేనేజర్ రమాదేవి, సర్పంచు నాగిరెడ్డి, బిల్డింగ్ సోసైటీమాజీ వైస్‌చైర్మన్ జీవీ.రామకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయూబ్, సల్మాన్, నాసిర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

సేవకు సలాం



ఇంటింటికీ సేవలు


కోవిడ్ లక్షణాలపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు అబీద, సల్మా పర్వీన్ (ఫైల్)

కరోనా కష్టకాలంలో ఇంటి నుంచి ప్రజలు బయటకు రావడానికి భయపడే పరిస్థితి. బయట ఏమి జరుగుతోందో తెలియదు. అలాంటి పరిస్థితుల్లో కలికిరి పట్టణానికి చెందిన మహిళ వలంటీర్లు సల్మా పర్వీన్, అబీద కరోనా పరిస్థితులు, లక్షణాలు, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కరోనా లక్షణాలు తెలిసిన వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, వైద్యాధికారుల సూచనల మేరకు క్వారంటైన్‌లో ఉండాలని తెలియచేశారు. అవసరమైన వారికి నిత్యావసరాలు, మందులు అందచేయడంలో ముందున్నారు. ప్రభుత్వం కోవిడ్ సమయంలో ప్రకటించిన రూ.వెయ్యి ఆర్థిక సాయాన్ని ఇంటింటికి పంపిణీ చేశారు. మహిళలైనా వీరు చూపిన తెగువకు స్థానికులు వీరిని ప్రశంసించారు. **- కలికిరి**

వలంటీర్ల సేవలు మరువలేనివి



కోవిడ్ కాలంలో వలంటీర్లు లేక పోతే మా పరిస్థితి వర్ణనాతీతంగా ఉండేది. ప్రభుత్వం అందిచే ఆర్థిక సాయం నుంచి దాతలు అందించే మాస్కులు, శానిటైజర్‌లు, ముందు జాగ్రత్త మందులు మా ఇంటికే అందించారు. ఫించనుకు కూడా ఇంటి బయట వెళ్లాల్సిన పని లేకుండా ఇంటికే తెచ్చిచ్చారు.

- వి.అలివేలమ్మ, బీడీ.కాలనీ, కలికిరి

జగనన్న సురక్షతో సత్వర సేవలు

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా


లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకువెళ్లడంతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలను సత్వరం అందించే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని 34,35 వార్డులకు సంబంధించి రామిరెడ్డి లేఅవుట్, 33 వార్డుకు సంబంధించి నీరుగట్టువారిపల్లె సచివాలయ పరిధిలో చౌడేశ్వరిగుడివద్ద జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. కమిషనర్ కే.ప్రమీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, కౌన్సిలర్లు రామిశెట్టిశివయ్య, ఎస్వీ.రమణ, డిష్ రామకృష్ణారెడ్డి, ఎం.వి.రమణ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండి సాంకేతిక కారణాలతో ఎవరికైనా పథకాలు అందకపోతే వారికి అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చామన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా నవరత్నాలు పథకాల్లో భాగంగా ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగనన్న చెప్పిన మాట ప్రకారం నెరవేర్చడం జరిగిందన్నారు. 40 ఏళ్ల అనుభవం, 14 ఏళ్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు తాను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇన్ని పథకాలు, అభివృద్ధి చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రజలను మాయమాటలతో మోసగించి అధికారంలోకి రావాలన్న ఆత్రత తప్ప వారికి మేలుచేయాలన్న ఆలోచన చంద్రబాబుకు ఏ కోశాన లేదన్నారు. అనంతరం 11 రకాల సేవలకు సంబంధించి ధృవీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, బి.ఏ.ఖాజా, ఈశ్వర్‌నాయక్, వసీం, భాను, బాలగంగాధరరెడ్డి, పసుపుపాడిరవి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, తట్టిశ్రీనివాసులురెడ్డి, శీలంరమేష్, బండిమనోహర్, గుండ్లూరురఫీ, ఆంజనేయులు, చరణ్, జేసీఎస్ ఇన్‌చార్జ్ మునిశేఖర్, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి నేతన్నల క్షీరాభిషేకం

నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, ఆర్థికంగా అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేతన్న నేస్తం ఎంతగానో ఉపయోగపడిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదోవిడత నిధుల పంపిణీ సందర్భంగా స్థానిక నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరిదేవాలయం ఎదుట చేనేతసంఘాల నాయకులు, కార్మికుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఐదేళ్లపాటు చేనేత కార్మికుడికి ప్రతి ఏడాదికి రూ.24వేలు చొప్పున 1.2లక్షలు ఆర్థికసహాయం అందించడంపై కృతజ్ఞతగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా,చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, చేనేత సంఘాల నాయకులు శీలంరమేష్, బండిమనోహర్, ఎస్వీ.రమణ, రామిశెట్టిశివయ్య, ఆర్.వి.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత


రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

వాల్మీకిపురం: బాలికల విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. శుక్రవారం స్థానిక తరిగొండ రోడ్డులోని గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయనను ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక కృషితో ఈ గురుకుల పాఠశాలను మంజూరు చేశారని, రాష్ట్రంలోనే ఉన్నత విద్యా ప్రమాణాలు కలిగిన పాఠశాలగా ప్రసిద్ధి చెందడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనం అన్నారు. గురుకులంలో చదువుతున్న విద్యార్థినులు అసౌకర్యానికి గురికాకుండా అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో వీధిలైట్లు ఏర్పాటుకు సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఉపాధ్యాయ క్వార్టర్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జిలాని, ఆజం, షఫీ, సురేఖ, అరుణ, మొహీనా, సోఫియా, వాసంతి, నవమల్లిక, హబీబ్, కోకిల పాల్గొన్నారు.

ఉచితంగా 11 రకాల ప్రభుత్వ సేవలు


పెద్దతిప్పసముద్రం : ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు

పీలేరు : జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వేపులబైలు పంచాయతీ మేళ్లచెరువు గ్రామ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఎలాంటి రుసుము లేకుండా 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ సుబ్రమణ్యం, ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి, సర్పంచ్ చెంగల్‌రాయుడు, ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భవనం వెంకటరమణారెడ్డి, నాగభూషణంరెడ్డి, రమేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

పెద్దతిప్పసముద్రం: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందించేందుకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, డ్రిప్ రమణ, కొట్టి మల్లికార్జున, తమక శంకర్,చంద్రశేఖర్,సుబ్బరాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సాంకేతిక లోపాలతో అర్హులై ఉండి ఎవరికైనా పథకాల వర్తింపులో జాప్యం జరిగి ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్ ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు ఉచితంగా పలు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

సులభంగా సర్టిఫికెట్లు

కేవీపల్లె : జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలు సులభంగా వివిధ రకాల సర్టిఫికెట్లు పొందవచ్చునని వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం కేవీపల్లె-2 గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేకుండా 11 రకాల సేవలు ఉచితంగా పొందవచ్చునన్నారు. అనంతరం పలువురికి ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, సర్పంచ్ నాగమణి, నాయకులు గజ్జెల శీనరెడ్డి, సైపుల్లాఖాన్, యర్రమరెడ్డి, హరిబాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

రామసముద్రం: రామసముద్రం మండలం కెసి.పల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో పీడీ శివకుమార్ స్మారకార్థం సందర్భంగా క్రీడాకారులకు క్రీడా దుస్తులను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయుల చేయూతతో దుస్తులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇదే పాఠశాలలో పని చేస్తున్న శివకుమార్ కరోనాతో చనిపోవడంతో వారిని గుర్తు చేసుకుంటు వ్యాయామ క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీదామోదరం, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వంశీకృష్ణ, పార్థసారధి, దిలీప్‌కుమార్, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


ఫిల్మ్,టీవీ జూనియర్ ఆర్టిస్టులతో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లెలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సమక్షంలో ఏపీఫిల్మ్ అండ్ టీవీ ఆర్టిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు , ఎస్వీ నాట్యకళామండలి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, పిచ్చళవాండ్లపల్లె తబల విశ్వనాథరెడ్డి తమ అనుచరులతో వైఎస్సార్‌సీలో చేరారు. రాష్ట్ర ఫిల్మ్‌టీవీ జూనియర్ ఆర్టిస్టుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు జెమినీకాంత్ ,సభ్యులు అలీఖాన్, బాలక్రిష్ణారెడి, రాజు, మహేంద్ర, సుబ్రమణ్యం, వెంకటేష్ అనుచరులు పార్టీలోకి చేరారు. వారిని పార్టీలోకి సాదరంగా ఎమ్మెల్యే ఆహ్వానించారు.

పేస్కేల్ అమలు చేయాలని ధర్నా

కలికిరి: గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్ అమలు చేయాలని వీఆర్‌ఏలు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వీఆర్‌ఏల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, ఇందులో భాగంగా వీఆర్‌ఏలకు పదోన్నతులు, 60సం. పైబడిన వీఆర్‌ఎలకు నామినీలు, డీఏ పునరుద్ధరించాలని తహసీల్దారు భాగ్యలతకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నేతలు రెడ్డెప్ప, నరసింహులు, మల్లికార్జున, నరేష్, యల్లారెడ్డి, మల్లిక, చైతన్య, రమణ, వెంకటరమణ, చిన్నప్ప పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలలోని గొళ్లపల్లి, దండువారిపల్లి, నాగంవారిపల్లి గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటకు పథకాలను అందించి ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. గత నాలుగేళ్లుగా అర్హులైన ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. కరోనా విపత్తుతో దేశం మొత్తం సంక్షోభంతో అతలాకుతలం అయినప్పటికీ, రాష్ట్రంలో సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించి ప్రజలకు సేవలందించడం జరిగిందన్నారు. కరోనా సహాయక చర్యల విషయంలోనూ రాష్ట్రం దేశంలో అగ్ర భాగంలో నిలిచిందన్నారు. మంచి పరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సేవలను గమనించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఈవో ఉదయ్ కుమార్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, సర్పంచ్ గంగులమ్మ, ఉప సర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు మహబూబ్‌బాషా, ఆనంద్, రాయుడు, సురేష్ రెడ్డి, రఘు, రవి, చలపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 40 లక్షలతో ఆర్టీసీ డిపోకు ప్రహరీ


మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

పీలేరు రూరల్ : పీలేరు ఆర్టీసీ డిపో స్థలం చుట్టూ రూ. 40 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఆర్టీసీ రాష్ట్ర డైరెక్టర్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు డిపోకు సంబంధించి సుమారు 15 ఎకరాల స్థలం ఉందని, ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే కలికిరి, మొలకలచెరువు ఆర్టీసీ బస్టాండ్‌లకు ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆర్‌ఎం రాము మాట్లాడుతూ జూన్‌లో పీలేరు ఆర్టీసీ డిపో 87 సర్వీసులతో రోజుకు 33 వేల కిలోమీటర్లు తిరిగి రూ. 11 లక్షలు ఆదాయం సంపాదించి జిల్లాలో మొదటి స్థానం సాధించిందని తెలిపారు. మదనపల్లె 1వ డిపో ద్వితీయ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం వారిని ఆర్టీసీ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎం కుమార్, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్, ఆర్టీసీ డీఈ పోతురాజు, జేఈ సిద్ధనాగులు, యూనియన్ నాయకులు రాజు, సి.వి. రమణ, వలి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: హయ్యర్ ఆప్షన్ పెన్షన్ విధానం ఆర్టీసీలో అమలు కావడంతో దీనికి కృతజ్ఞతగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ-1 డిపో కార్యాలయంలో సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సిబ్బంది పాలాభిషేకం చేశారు. డిపో ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ 1-డీఎం మూరే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో ఉద్యోగుల సంక్షేమం కోసం సీఎం హయ్యర్ పెన్షన్ స్కీం అమలు చేశారన్నారు. దీంతో ఎంతో మంది సిబ్బంది లబ్ధి పొందుతారాన్నరు. ఆర్టీసీ ప్రభుత్వంలోకి విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి తోడ్పాటు ఇస్తున్న సీఎంకు సిబ్బంది సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

కురబలకోట: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం ద్వారా వారి మన్ననలు పొందవచ్చని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని మట్లివారిపల్లె సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి ఉద్యోగితో ఆమె విధి నిర్వహణ పని తీరు గురించి మాట్లాడారు. వివిధ సమస్యలపై వచ్చే వారికి సత్వరం పరిష్కరిస్తే నమ్మకం పెరుగుతుందన్నారు. దీనికి తోడు ఆసక్తితో పని చేస్తే జనం మనసుల్లో స్థానం ఉంటుందన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆమె సంపద కేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలో పశు సంపద ఎక్కువగా ఉన్నందున గోబర్ గ్యాస్ ప్లాంట్లుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆతర్వాత ఆమె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. సర్పంచ్ సోమిరెడ్డి, ఈఓఆర్డీ ఎస్. అబ్దుల్ షుకూర్, కార్యదర్శి ప్రవీన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పట్టు రైతులకు అవగాహన సదస్సు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లి సచివాలయంలో శుక్రవారం రాష్ట్రీయ కృషి వికాస్ యోజనా పథకం ద్వారా పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టు గూళ్ళ పెంపకం, సాగు విధానం, ప్రభుత్వం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఏడీఎస్ రాంమోహన్‌రావ్, సిబ్బంది రసూల్,రమణ, బావాజాన్‌లు పాల్గొన్నారు.